ఇల్లాలి నిర్ణయం

ముద్దంశెట్టి హనుమంతరావు

శేఖర్ ట్రేలోవున్న కేసులు ఒక్కొక్కటీ తీసి సంతకాలు పెడుతున్నాడు. మధ్యమధ్యా టెలిఫోను మోగినప్పుడంతా మాట్లాడుతున్నాడు. సిగరెట్లు ఒకదాని వెంట మరోటి పీల్చేస్తున్నాడు.

ట్రేలో మేటలా పడున్న కేసులు, ఆరోజు యెట్లాగైనా సంతకాలు పెట్టేయ్యాలన్న దీక్ష, పట్టుదల, అతని ప్రతికదలికలోనూ అగుపిస్తున్నయ్.

స్ప్రింగ్ డోర్స్ తోసుకొని, శ్రీధర్ అప్పుడే వచ్చాడు.

"గుడ్ మార్నింగ్ శేఖర్..."

"గుడ్ మార్నింగ్... రావోయ్... రా... కూచో..." ఆహ్వానిస్తూనే సంతకాలు పెడుతున్నాడు, శేఖర్.

శ్రీధర్, శేఖర్కి అభిముఖంగా కూచున్నాడు.

"ఏవిటీ? అంత దీక్షగా వర్క్ చేస్తున్నావ్వాళ? సాయంత్రం యెక్కడికైనా ప్రోగ్రామ్ వుందా?" అడిగాడు శ్రీధర్.

శేఖర్ కలాన్ని స్టాండు మీద పెట్టేసి, చిన్న నవ్వు నవ్వి, సిగరెట్ దమ్ము గట్టిగా లాగాడు.

"అబ్బే! ప్రోగ్రామ్ యేమీ లేదనుకో! రెండ్రోజులు క్యాంపుకెళ్లి వచ్చేసరికి, పాపంలా పెరిగిపోయాయి కేసులు. టేబిలు మీద కేసులు పడుంటే, నాకు మాత్రం యేదో పెద్దభారం గుండెల మీదున్నట్టే వుంటుంది. వాటిని యెంత త్వరగా డిస్పోజ్ చేస్తే, అంత హాయనిపిస్తుంది. అందుకనే ఓపిగ్గా కూచున్నా!" అన్నాడు శేఖర్.

శ్రీధర్ మందహాసం చేశాడు. "గుడ్ హేబిట్... నీ అంత ఓపిగ్గా నేను కూచోలేను సుమా! ఔనూ, యీ మధ్య నువ్వు నాటకాల పిచ్చిలో పడ్డావని విన్నాను. నిజమేనా?" ప్రశ్నించాడు శ్రీధర్.

యీ ప్రశ్న వెయ్యాలన్న ప్రయత్నం నాలుగు రోజుల్నించి చేస్తున్నాడు శ్రీధర్. కాని, యీ రోజుకి వీలు చిక్కింది.

శేఖర్, ముసిముసి నవ్వేడు మరి కాల్చడానికి వీలుగా లేని సిగరెట్ ముక్కని అష్ట్రేలో పడేస్తూ అన్నాడు.

"అబ్బే! నాటకాలంటే, నాకేం పిచ్చి లేదోయ్. నిజం చెప్పాలంటే, నాటకాలు చూడ్డం కూడా అలవాటు లేదు నాకు. మా ఆవిడకిమాత్రం మొదట్నుంచీ నాటకాలంటే, వెర్రి నాటకాల గురించి మాట్లాడ్డమన్నా, నాటకాలు వెయ్యడమన్నా, ఆమెకి యెంతో సరదా. ఆమె వుత్సాహానికి అడ్డు తగల్డం యిష్టంలేక, ప్రోత్సహిస్తూ వుంటాన్నేను, ఈ మధ్యనే యేదో నాటకం ప్రారంభించి, రిహార్సిల్సు వేస్తున్నారు"

శ్రీధర్ ఓ నిట్టూర్పు విడిచాడు. "ఐసీ... వాళ్లేదో నాటకం వేస్తున్నట్టు విన్నాన్లే. అయితే, అందులో నువ్వు వెయ్యడం లేదన్నమాట..."

శేఖర్ ఫకాల్న నవ్వేడు, "మంచివాడివే! నేను నాటకాలు వెయ్యడమేవిటి? నే నేగనుక నాటకాలు వెయ్యడం ప్రారంభిస్తే, వాటిని చూసేవాళ్లుండరేమో!" పరిహాస ధోరణిలో అన్నాడు.

"అన్నట్టు, ఆ నరహరి నిర్వహణలో వేస్తున్నారటగా?" మళ్లీ ప్రశ్న శ్రీధర్నించి.

"ఔనోయ్. ఆయనే స్వయంగా వచ్చి, నాటకంలో మా ఆవిణ్ణి వేషం వెయ్యమని కోరితే, ఆమె కాదనలేకపోయింది. రోజూ ఆయనే కారులో మా ఆవిణ్ణి తీసుకు వెళ్తా



వుంటాడు. నాటకాలు వేయించడమంటే, యేవిటో ఆయనకి అంతసరదా?'' మామూలు ధోరణిలో అన్నాడు, శేఖర్.

శ్రీధర్, శేఖర్ మొహంలోకి పరిశీలనగా యెందుకో చూశాడు. ఆమొహంలో అమాయకత్వం, కొట్టొచ్చినట్టు కనిపించింది. తన మనస్సులోని మాట చెప్పడమా, మానడమా, అని తటపటాయించాడు త్రుటికాలం. అయితే, చెప్పాలన్న నిర్ణయానికే వచ్చాడు. "నీతో ఓ విషయం చెప్పాలనుంది శేఖర్ ... కోపగించుకోవు కదా?'' చనువుగా అన్నాడు. వాళ్లిద్దరికీ సన్నిహిత స్నేహం వుందిగాబట్టి, అలా అనగలిగాడు శ్రీధర్. "నాకు కోపం తెప్పించే విషయం నువ్వేం చెబుతావు లేవోయ్...ఫరవాలేదు...చెప్పు...''

"నాటకకళపట్ల అభిమానంవుండొచ్చు... ఆసక్తి వుండొచ్చు... నాటకాలు వెయ్యాలన్న వుత్సాహం వుండొచ్చు. కాని, నరహరి లాంటి వ్యక్తి ఆధ్వర్యంలో నాటకాలు వెయ్యడం, మనవంటివాళ్లం ప్రోత్సహించ కూడదు''తను చెప్పదల్చుకున్నది టకటకా చెప్పేశాడు,శ్రీధర్.

శేఖర్, శ్రీధర్ మొహంలోకి వింతగా, ఆసక్తితో చూశాడు.

"అంటే. నీవుద్దేశం నాకు బోధపడలేదు'' అన్నాడు.

శేఖర్ అమాయకత్వం, అర్థమై పోయింది శ్రీధర్‌కి. నరహరి గురించిన వివరాలేవీ అతనికి తెలీవని తేటతెల్లమై పోయింది.

"అంటె, నీకు నరహరి గురించి యేమీ తెలీదా ?''

"నాకు తెలిసిందంతా ఒక్కటే! ఆయనకి లలితకళల పట్ల యెంతో ఆసక్తి, అభిమానం వున్నాయని, వాటి ఔన్నత్యం కోసం ఆయన ప్రాకులాడుతూ వుంటారనీ తెలుసు. ముఖ్యంగా నాటకాలంటే చెవికోసుకుంటారని తెలును... నలుగురూ అనేదికూడా అదే.''

శ్రీధర్ నవ్వేడు.

"లలిత కళల ఔన్నత్యం కోసం నరహరి ప్రాకులాడ్డం యేవిటీ? నా బొంద...అదంతా వట్టి బూటకం. మేకతోలు కప్పుకున్న తోడేలు జీవితం అతనిది. కళారాధన పేరిట, అవినీతి పనులు చెయ్యడంలో అతనిది అందె వేసిన చెయ్యి. అతని గురించి వూళ్లో కొందరికి బాగా తెలుసు. మిగిలిన కొందరూ నీ లాంటి భావనలోనే వుండి, అతనికి బ్రహ్మరథం పడతారు. నువ్వుగాన్ని, మీ ఆవిడగాన్ని, అతని నిజస్వరూపాన్ని వూహించకపోవడం దురదృష్టకరం. నిజానికి, అతనంటే నాకేం ద్వేషం లేదు. అసూయ అంతకంటే లేదు అయితే, మొన్నను క్లబ్బులో యీ టాపిక్ వచ్చేసరికి. నేనే ఆశ్చర్యపోయాను. అందుకే, నేరుగా నీ దగ్గరికొచ్చి చెప్పాను. నన్ను అపార్థం చేసుకోవనే నా నమ్మకం...''అన్నాడు, శ్రీధర్.

శేఖర్‌కి,ఒక్కసారి కళ్లు తిరిగినట్టయ్యింది. తనెదుట అంతా చీకటిగా వున్నట్టు క్షణం ఫీలయ్యాడు. ఏవిటి తను వింటున్నది ? నరహరి ప్రవర్తన గురించి తనుగాని, కల్యాణి గాని, తప్పుగా వూహించలేదే ! శ్రీధర్ లాంటి సుస్నేహితుడు, సన్నిహితుడు, శ్రేయోభిలాషి చెబుతున్న మాటల్ని తను నమ్మకుండా యెట్లా వుండగలడు ?... ఈఆలోచనల అలలమధ్య క్షణంపాటు యిరుక్కుని మాట్లాడలేక పోయాడు.

పరిస్థితిని యిట్టే గ్రహించిన శ్రీధర్, మళ్లీ అన్నాడు.

"ఆలోచనల్లో పడితే లాభంలేదు శేఖర్ ! మనం విద్యావంతులం. సంస్కారం మన సొత్తు. కాదనను. మనమూ సంఘంలో ఒక భాగం. పరిస్థితుల్నీ, వ్యక్తుల్నీ, మనం దృష్టిలో పెట్టుకుని మసలడం మనకీ అవసరమే: చనువుంది గాబట్టి స్నేహితుడిగా నా బాధ్యత తీర్చుకున్నాను. తరువాత నీ యిష్టం. నువ్వుగాని, మీ ఆవిడగాని నన్ను అపార్థం చేసుకోకండా వుంటే సంతోషిస్తాను. వెళ్ళొస్తా మరి!'' అంటూ వెళ్లిపోయాడు.

కాస్సేపటి వరకూ, శేఖర్ ఆలోచనల మధ్య నలిగిపోయాడు. సిగరెట్టు ముట్టించాడు. మెదడు వేడెక్కి పోయింది. కణతలు పట్టుకుని అలా కూచుండి పోయాడు.

* * *

సాయంత్రం ఆరింటికి ఇల్లు చేరుకున్నాడు, శేఖర్. కల్యాణి అప్పుడే నరహరి కారులో వెళ్లినట్టు చెప్పింది వంటమనిషి. ఇంతవరకూ యెప్పుడూ లేని అసహ్యం ఆతనిలో మొలకెత్తింది ఆక్షణంలో. చిరుకోపం, అతణ్ణి చీకాకు పర్చింది. విసుగ్గా క్షణం పచారుచేసి, సోఫాలో కూలబడ్డాడు. వంటమనిషి కాఫీ తెచ్చి అందిస్తే, తాగాడు. చిన్న బ్బాయి దగ్గరకొచ్చి యేవో కబుర్లు చెబుతూ వుంటే, పరధ్యానంగా 'వూ' కొడుతున్నాడే తప్పించి, సమాధానాలు చెప్పడం లేదు. అతని ఆలోచనలే వేరు.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. బైట కారాగింది. డోర్‌వేసిన చప్పుడు. కల్యాణి 'గుడ్‌నైట్' అని చెప్పాక, కారు కదలడం శేఖర్‌కి స్పష్టంగా విన్పించాయి. మనసులో యేమూలో ద్వేషం రగులుకుంటోంది చెప్పలేని ఓవిచిత్రమైన స్పందనకి లోనయ్యాడు శేఖర్. ముసిముసి నవ్వుకుంటూ లోపలికి వచ్చింది కల్యాణి. భర్త వున్న గదిలోకి వచ్చి, బాగా అలసిపోయినట్టుగా వుస్సురనుకుంటూ, భర్తకి అభిముఖంగా వున్న సోఫాలో కూలబడింది.

"అబ్బబ్బ ! రిహార్సలంటే వుండుండీ విసుగుపుడుతోందండీ! ఒకరొస్తే, మరొకరు వేళకి రారు. వచ్చినా, పోర్షన్లు కంఠస్తం చెయ్యరు. ఏవో సాకులు మాత్రం సవాలక్ష చెబుతారు. కొందరు మరీ అధ్వాన్నంగా వున్నారు'' అంది కల్యాణి విసుగ్గా, భర్తకేసి చూస్తూ.

"అంత విసుగు పుడుతూ వుంటే, ఎందుకా రిహార్సలుకి వెళ్లడం ? నాటకం వెయ్యడమే మానేయకూడదూ ?'' తనలో మొలకెత్తిన ద్వేషాన్ని పైకి పొక్కనీయకండా, మామూలు ధోరణిలో అన్నాడు.

కల్యాణి, కళ్లింతవి చేసుకుని మరీ భర్తకేసి చూసింది.

"మంచివారేనండీ! కళలంటే ముఖ్యంగా నాటకకళంటే విసుగుపుడితే యెట్లాచెప్పండి? అందరూ విసుగు పెంచుకొని, నాటకాలే మానేస్తే, ఆ కళ అభివృద్ధి చెందేదెట్లా?'' తనే గొప్పగా కళా సేవచేస్తున్నట్టు ఫీలవుతూ అంది కల్యాణి.

బరువుగా ఓ నిశ్వాసం విడిచాడు, శేఖర్. చెప్పదల్చుకున్నది చెప్పడానికి ధైర్యాన్ని కూడ దీసుకున్నాను.

వాడండి ముఖ్యంగా అలస్యమైన,
క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన,
లేక ఆగిపోయినబహిష్టకు
SEALED PACKING. 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
MFRS: SEENU & CO., MADRAS-21

ఇల్లాలి నిర్ణయం

"ఏమైనా, నువ్వు ఆ నరహరితో తిరగడం మాత్రం నా కిష్టంలేదు కల్యాణీ! ఇహనించి నాటకాలే మానుకుంటే మంచిదనిపిస్తోంది" అనిమాత్రం చెప్పగలిగాడు, శేఖర్.

కల్యాణి, నిలువునా నిర్ఘాంతపోయింది. భర్తనోట, అటువంటి మాట యేనాడూ వినలేదు. తన స్వేచ్ఛని ఆయనెప్పుడూ అవరోధపర్చలేదు. ఒక పరిధిలో వుండమని, యే రోజూ శాసించలేదు. అటువంటి వ్యక్తి నోట యీనాడు, నరహరితో తిరగడం మానేయమన్న ఆంక్ష వినడం ఆమెకి అశ్చర్యమూ కలిగింది. దాంతోపాటు మైల్డ్ పైపు ఆగ్రహమూ కలిగించింది.

"ఏమిటండీ మీరంటున్నది? నేనేం వూరికే షికార్లు తిరగడం లేదుగా ఆయనతో. రిహార్సలుకని వెడుతున్నాను. అదీ రహస్యంగా వెళ్లడం లేదు కూడా! మిమ్మల్ని అడిగే వెళ్తున్నాను. హఠాత్తుగా మీలో యీమార్పు రావడానికి కారణం యేమిటో వూహించలేక పోతున్నాను. నరహరిగారికి నాటకాలంటే ఒక రకం పిచ్చి. ఆ పిచ్చితోనే పాపం ఆయన మనింటికి కారులో వచ్చి నన్ను తీసుకెళ్తున్నారు. అటువంటి వ్యక్తిని మీరు అనుమానిస్తున్నారా?" సూటిగా భర్త మొహంలోకి చూస్తూ, విసురుగా అంది. ఆమె మొహం అప్పటికే కందగడ్డలా మారి పోయింది.

శేఖర్ కాస్తంత తడబడ్డాడు. "అనుమానించడం కాదు కల్యాణీ..." అని యింకేమో చెప్పబోతూ వుంటే, ఆమె అడ్డొచ్చింది, ఖంగుమనే గొంతుతో.

"చాల్లెండి... మరింకేం చెప్పొద్దు. మీ సంకుచిత మనస్తత్వం, సభ్యతలేని మీ సంస్కారం, అర్థమయ్యాయి. ఎవరైనా వింటే నవ్విపోతారు కూడాను. చెప్పకుంటే సిగ్గుచేటు. ఆఫీసరుగిరీ వెలిగిస్తుంటేసరా? సభ్యత, సంస్కారం అలవడాలి... తల్చుకుంటే నాకే యేహ్యాభావం పుడుతోంది..." అంటూ రివ్వున లేచింది.

శేఖర్ వొళ్లు చల్లబడింది. అతనికి తగువులంటేనే భయం.

"కోపం తెచ్చుకోకు కల్యాణీ. నేను, నీ ప్రవర్తనని శంకించడంలేదు. అయితే నరహరి ప్రవర్తన మంచిది కాదన్న వార్తలు అందుతున్నాయి. మనం ఎంత నిర్మలంగా వున్నా, సంఘానికయినా కాస్తంత వెరవాలి గదా! అందుకనే అతనికిదూరంగా వుంటే మంచిదని చెబుతున్నాను" అన్నాడు, సౌమ్యంగా.

"మిమ్మల్ని మీరు సమర్థించుకోడానికి ప్రయత్నించకండి. మీరింతగా దిగజారి పోతారని, నేనెప్పుడూ వూహించలేదు..." అంటూ విసురుగా తన గదిలోకి వెళ్లిపోయింది, కల్యాణి.

పిల్లలు, వింతగా చూస్తూ నిలబడ్డారు. తల్లి వెళ్లిపోతూవుంటే, ఆమెని అనుసరించారు.

శేఖర్, వుస్సురనుకుంటూ సోఫాలో కూలబడిపోయాడు. ఈ విషయంలో మరీ రభస చెయ్యడం, తన సంస్కారానికే గొడ్డలిపెట్టనిపించింది. అతని మెదడు మాత్రం ఆలోచిస్తూనే వుంది.

* * *

మూడు రోజులు గడిచాయి. కల్యాణి మామూలుగానే రిహార్సలుకి వెళ్లి వస్తోంది, నరహరికారులో. శేఖర్ ఆమెని అవరోధపర్చలేదు అవరోధపర్చి, వాగ్వివాదాలు పెంచుకుని, నలుగురిమధ్య పడ్డం అతనికి మనస్కరించలేదు. కల్యాణి అన్నట్లుగానే మిగతావాళ్లు కూడా తన సంస్కారాన్ని గేలిచేస్తారనే భీతి కూడా అతనికి లోలోపల లేకపోలేదు. తను చెప్పినా, లక్ష్యపెట్టకుండా వెళ్తోన్నభార్యపై మొదట్లో కోపం వచ్చినా, తమాయించుకున్నాడు.

నాలుగో రోజు—

రాత్రి ఎనిమిది అప్పుడే దాటింది. శేఖర్ షేక్స్పియర్ నాటకాల సంపుటిని చదువుతున్నాడు. పిల్లలు వరండాలో ఆడుకుంటున్నారు. కల్యాణి, రొప్పుకుంటూ వచ్చింది లోపలికి. కారువచ్చిన శబ్దం వినపడలేదు శేఖర్‌కి. ఆశ్చర్యపోయాడు, బైటికి చూశాడు. ఓ రిక్షా వెనక్కి తిరిగిపోతోంది.

"ఇదేమిటి కల్యాణీ, ఇవ్వాళ నరహరి కార్లో డ్రాప్ చెయ్యలేదా?" అన్నాడు శేఖర్.

కల్యాణి కళ్లు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయ్. మొహం యెర్రబారింది.

"ఆ స్కౌండ్రల్ పేరెత్తకండి..." అంది కసిగా సోఫాలో కూచుంటూ, అమె మొహంలో యేదో ఆత్రుత, ఆరాటం, భయం, తొంగి చూస్తున్నట్టు కనిపించింది. తెల్లని ఫాల భాగంపై చెమట బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. చప్పున రుమాలుతీసి మొహం ఒత్తుకుంది కళ్యాణి.

కేవలము ఒక్క
అవేదన్®
ప్లస్

సత్వరమైన, నిశ్చయమైన
నివారణ యిస్తుంది!
SARABHAI CHEMICALS PRIVATE LIMITED
Shilpi-SC-6A/74 Tel



ఇల్లాలి నిర్ణయం

"ఏం జరిగింది కళ్యాణీ? నీ మాటలు నాకేం అర్థం కావడంలేదు. నరహరి యిప్పుడు స్కౌండ్రల్ అయ్యాడంటే, యేదో కారణం వుంటుంది." అన్నాడు శేఖర్.

కళ్యాణి కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది. మొహంలో రంగు మారింది.

"నన్ను మరీ చిత్రవధకు గురికానివ్వకండి... ప్లీజ్..." అంది రుద్ధ స్వరంతో. "ఆరోజు మీరు చెప్పినా, మీ హితవు మాటల్ని లెఖ్ఖ చెయ్యలేదు. పైగా మీ సంస్కారాన్ని గేలిచేశాను. ఫలితంగా యిప్పుడు బాధపడుతున్నాను..."

"ఏమయ్యింది యింతకీ?" అంటూ ఆత్రుతగా అడిగాడు.

"ఇన్నాళ్ళూ ఆ నరహరిని యెంతో సంస్కారం, సభ్యతగల వ్యక్తిగా భావించి గౌరవించాను. నాటకకళ వుద్ధరించడానికే ఆయన పాటుపడుతున్నాడని వూహించాను. నా దృష్టిలో అతనప్పుడు వున్నతుడు. కాని, యీ రోజు వాడి నిజరూపం తెలిసింది. కారులో తీసుకొస్తూ, అసభ్యంగా మాటలు ప్రారంభించి, నన్ను లోబర్చుకోవాలని ప్రయత్నించాడు. వాడికి తగిన బుద్ధిచెప్పి, కారులోంచి దిగి, రిక్షాలో వచ్చేశాను. వాడు ద్రోహి... వంచకుడు. సంస్కారంలేని రాస్కెల్... ఈ విషయంలో మిమ్మల్ని అనవసరంగా అపార్థం చేసుకుని, మీ మనస్సుకి కష్టం కలిగించాను. నన్ను క్షమించండి." అంటూ రెండు చేతుల్తో మొహం కప్పుకొని వెక్కివెక్కి యేడ్చింది.

శేఖర్‌కి శ్రీధర్ మాటలు గుర్తుకొచ్చాయి. కళ్యాణికి దగ్గరగా వెళ్లి, చేతులు మొహం మీంచి తీసేస్తూ "ఛా! అదేమిటి కళ్యాణీ! పోనీ, యిప్పటికయినా నిజం తెలుసుకున్నావు, అదే చాలు. కనీసం నాలోని సంస్కారం తెలుసుకున్నందుకు అవకాశం చిక్కింది... ఇక అదంతా మర్చిపో!" అన్నాడు మెల్లగా మందహాసం చేస్తూ.

కళ్యాణి రుమాలుతో మొహం తుడుచుకుంది.

"నిజమేనండీ. మీ సంస్కారాన్ని గేలి చేస్తే నేనే సంస్కారహీనవయ్యాను. అందుకు సిగ్గు పడుతున్నానుకూడాను. ఈ రోజునించీ నాకు నాటకాలంటేనే అసహ్యం యేర్పడింది. మరెప్పుడూ వెయ్యను." అంది పశ్చాత్తాపంతో. శేఖర్ నవ్వేడు.

"మరీ అంత గా మారిపోకూడదు కళ్యాణీ! అందరూ నరహరిలా వుండరుగా? మనుషుల్ని బట్టి మనమూ ప్రవర్తించాలి."

"వద్దండీ! మీరన్నట్టు సంఘాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలిగా. అయినా, నేనో నిర్ణయానికొచ్చాను. మరెప్పుడూ నాటకాలు వెయ్యను. చాలు, యీ అనుభవం." అంది కళ్యాణి.

శేఖర్ ఆమెను దగ్గరగా తీసుకున్నాడు. పిల్లలు వాళ్లిద్దర్నీ దూరంగా నిల్చుని చూస్తున్నారన్న సంగతి గుర్తించిన శేఖర్ కంగారుగా వెనక్కి అడుగు వేశాడు నవ్వుకుంటూనే.

"లేవండి...భోజనం చేద్దాం..."అంటూ లోపలికి నడిచింది కళ్యాణి. పిల్లలు ఆమె వెంట నడిచారు.

ఆ క్షణంనించీ కొత్త జీవితం ప్రారంభమైనట్టుగా అనుభూతిని పొందాడు శేఖర్. శ్రీధర్‌ని మాత్రం ఓ మారు మనసులో అభినందించుకున్నాడు.

ఆటల పోటీ

—ఎల్. మాలకొండయ్య

వ్యాపార మనే ఆటల పోటీలో
అన్నిటికన్నా మిన్న అధికలాభాల ఆట!
ఆట ఏకటే విధానంలో ఆడినా
గోల్సు దొంగదాటుగా కొట్టినా
పొందే ఫలితం అధికలాభమే!
సరుకుల పంపిణీ సంగీతంలో
అధికలాభాల పాటలే ఆధునిక బాణీలు
ప్రాణ రక్షణ నిచ్చే సరుకుల్లో
ప్రాణాలు తీసే కల్తీ విష పదార్థాలే
ఈ సంగీతంలో సరిగమ స్వరాలు!
మెదడులోని మెలికలు
చేతి మలుపుల మసలికలు
కనురెప్పల మాయ కదలికలు
ముసుగులోని గుసగుసలు
అధిక లాభాల ఆటల పోటీలో
విజయానికి విప్పెనలు!
ఈ అధిక లాభాల ఆటల పోటీలో
ఆటగాళ్లు తామే, అంపైర్లు తామే!
అందుకనే వోడిపోయేది ఎప్పుడూ పేదప్రజలే!